ఆసిఫ్‌నగర్ ఏసీపీపై చర్యలు తీసుకోండి


పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న పాండు యాదవ్, ఠాకూర్ అమర్ సింగ్ తదితరులు

అబిడ్స్/గోల్కొండ: కార్వాన్ బీజేపీ ఇన్‌చార్జి ఠాకూర్ అమర్‌సింగ్‌పై దౌర్జన్యంగా ప్రవర్తించిన ఆసిఫ్‌నగర్ ఏసీపీ కిషన్‌కుమార్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వి.పాండు యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డికి పాండు యాదవ్, ఠాకూర్ అమర్‌సింగ్‌తో పాటు పలువురు నాయకుల బీజేపీ బృందం ఆసిఫ్‌నగర్ ఏసీపీ కిషన్‌కుమార్‌ను సస్పెండ్ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పాండుయాదవ్ మాట్లాడుతూ.. ఏసీపీ కిషన్‌కుమార్ ఠాకూర్ అమర్‌సింగ్‌తో పాటు స్థానిక వ్యాపారులపై కూడా అమర్యాదగా ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పోలీస్ కమిషనర్ ఏసీపీ కిషన్‌కుమార్ దౌర్జన్యం చేసిన వీడియోల ఆధారంగా చర్యలు తీసుకోనిచో తాము కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, సహాయ హోంమంత్రి బండి సంజయ్, కేంద్ర హోంశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అని గొప్పలు చెప్పుకునే పోలీస్‌శాఖ అధికారి దౌర్జన్యం చేయడంతో ఫ్రెండ్లీ పోలీసింగ్ అవుతుందా అని ప్రశ్నించారు. ఏసీపీ కిషన్‌కుమార్‌పై కఠిన చర్యలు తీసుకొని పోలీస్‌శాఖ మీద సంపూర్ణ విశ్వాసం ప్రజలకు కలిగే విధంగా కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి కృషి చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు డిజ్వర్‌సింగ్, ఆకుల గోవర్ధన్, ఇంద్రసేనారెడ్డి, బంగారి ప్రకాష్, అడ్వకేట్ కరుణసాగర్, ఉదయ్‌కుమార్, వినయ్ సింగ్, ఆకాష్ సింగ్, విద్యాసాగర్, అనిల్‌చారి, సునీల్‌యాదవ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలి


టీజీఎస్‌పీడీసీఎల్ చైర్మన్‌తో సమావేశమైన ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అధికారులకు సూచించారు. బుధవారం జలమండలి ఎండీ, టీజీఎస్‌పీడీసీఎల్ చైర్మన్లను కలిసి ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రతిపాదించిన డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ అభివృద్ధి పనులపై స్థానిక అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి పనులు పూర్తి చేయాలని జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డికి వివరించామన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి నూతన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, కేబుల్ వైర్ల ఏర్పాట్లపై విద్యుత్ శాఖ చైర్మన్, ఎండీ ముషారఫ్ అలీ ఫారుఖీతో సమావేశమై చర్చించామన్నారు. రానున్న వర్షాలకు నాలాలు, వరదనీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఇప్పటికే జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశామన్నారు.

అన్నదానం

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి నిత్యం వేలాది మంది రోగులు, వారి సహాయకులు వస్తుంటారు. రోగుల కోసం ఆస్పత్రిలోని డైట్ విభాగం భోజనం అందిస్తుండగా, వారి సహాయకుల కోసం ఆస్పత్రి ప్రాంగణంలోని రూ.5 భోజన కేంద్రంలో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం అందిస్తుంటారు. వీరికి తోడు పలు స్వచ్ఛంద సంస్థలు, పలువురు ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద నిత్యం అన్నదానం చేస్తుంటారు. బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాదాపు వెయ్యి మందికి పైగా అన్నదానం నిర్వహించారు.


ఉస్మానియా ఆస్పత్రి వద్ద అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సన్మానం


కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న గోపిశెట్టి ప్రమోద్

జియాగూడ: ప్రధాని నరేంద్రమోదీ క్యాబినెట్‌లో 2వ సారి కేంద్రమంత్రిగా పదవీ ప్రమాణస్వీకారం చేసిన సికింద్రాబాద్ పార్లమెంటు సభ్యుడు జి.కిషన్ రెడ్డిని బీజేపీ రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు గోపిశెట్టి ప్రమోద్ ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో ఆయనను కలిసి అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా గోపిశెట్టి ప్రమోద్ మాట్లాడుతూ.. కేంద్ర నిధులతో తెలంగాణ రాష్ట్రాన్ని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు కె.నర్సింగ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామ్‌బాగ్ జగన్నాథ మఠం పీఠాధిపతి అస్తమయం



జియాగూడ: సీతారామ్‌బాగ్ జగన్నాథస్వామి ఆలయ మఠ పీఠాధిపతి త్రిదండి శ్రీనివాస వ్రతధర నారాయణ రామానుజ జీయర్ స్వామి (82) మంగళవారం మృతి చెందారు. సీతారామ్‌బాగ్‌లో జగన్నాథస్వామి మఠాన్ని నెలకొల్పి స్వామీజీ అప్పటి నుంచి హిందూ ధర్మ పరిరక్షణ కోసం జగన్నాథస్వామి వృద్ధాశ్రమం, గోసేవా సంస్థాన్, భవనం, గురుకుల్ వేద విద్యాలయ, రంగనాథస్వామి మందిరం, శ్రీమన్నారాయణ శరణాగతి ఆశ్రమం, భాగవత్ కథా పారాయణం, 108 లక్ష్మీ నారాయణ యజ్ఞాలు, హనుమాన్ చాలీసా పారాయణం, హనుమాన్ దీక్ష, ఎన్నో ఆలయాల్లో విగ్రహాల ప్రాణప్రతిష్ఠ చేశారని మహంతి అచ్యుత రామానుజ చార్య స్వామి(అజయ్ స్వామి) తెలిపారు. పరమపదించిన స్వామి త్రిదండి శ్రీనివాస వ్రతధర రామానుజ స్వామి బృందావనంలో సమాధి చేశారు. నగర భోజనం, వైకుంఠ ఉత్సహం, చిన్నజీయర్ స్వామి ఆదేశానుసారం నిర్వహించడం జరుగుతుంది.

ఎస్ఎం హుస్సేనీ ముజీబ్‌కు సత్కారం

చార్మినార్: తెలంగాణ ఎన్జీవోల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎస్ఎం హుస్సేనీ ముజీబ్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు, సామాజిక కార్యకర్త మహ్మద్ ఒమర్ ఖాన్ బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సేవకు ముజీబ్ చేసిన విశేష కృషితో పాటు ఎన్నికలలో అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకున్నారన్నారు. ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ సమస్యలను పరిష్కరించడంలో ఆయన అంకితభావంతో పని చేశారన్నారు. ఇప్పటికే నాలుగు సార్లు హైదరాబాద్ టీఎన్‌జీవోల అధ్యక్షుడిగా కొనసాగిన ఆయనకు కేంద్ర యూనియన్‌లో స్థానం లభించడం ఆయన చేసిన సేవలకు నిదర్శనమన్నారు.


హుస్సేనీ ముజీబ్‌ను సన్మానిస్తున్న ఒమర్ ఖాన్

డ్రైనేజీలకు మరమ్మతులు



గోల్కొండ: ఆషాఢ మాసం బోనాల సందర్భంగా డ్రైనేజీలకు మరమ్మతులు చేయిస్తున్నామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తూమ్‌కుంట అరుణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి గుడిమల్కాపూర్ డివిజన్‌లోని వివిధ బస్తీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీలు, రోడ్లకు మరమ్మతు పనులు చేయాలని తాము గతంలో జలమండలి అధికారులను, బల్దియా అధికారులను కోరడం జరిగిందన్నారు. స్పందించిన జలమండలి మేనేజర్ నరేందర్, లైన్‌మెన్ కొమురయ్యతో కలిసి డ్రైనేజీలకు మరమ్మతులు చేయడమే కాకుండా ధ్వంసమైన మ్యాన్‌హోల్స్‌ను తొలగించి కొత్తవి వేస్తున్నారన్నారు. దుర్గాప్రసాద్, నవీన్‌ముదిరాజ్, మరాఠి నర్సింగ్, ఆనంద్‌యాదవ్ ఉన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

గోల్కొండ: రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. షేక్‌పేట్ నాలా వద్ద డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కేక్‌కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమేష్, స్వరూపా, సీతమ్మ, అనురాధా తదితరులున్నారు.


కేక్‌కట్ చేస్తున్న నాయకులు

వర్షాకాలంలో తస్మాత్ జాగ్రత్త

- పొంచి ఉన్న అంటు వ్యాధుల ప్రభావం
- ముందు జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు
- పరిసరాల పరిశుభ్రంతో పాటు వ్యక్తిగత శుభ్రత అవసరం


మీరాలంమండిలో పేరుకుపోయిన చెత్త కుప్పలు

చార్మినార్: వర్షాకాలంలో అంటు వ్యాధులు సోకే ప్రమాదాలు పొంచి ఉన్నందున తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. సహజంగానే వర్షాకాలంలో చెత్తకుప్పలు, కలుషిత నీరు, దోమల వృద్ధి తదితర సమస్యలతో అనేక అంటు వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందుకోసం ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే రోగాలు దరిచేరవని వైద్యులు సూచిస్తున్నారు. ప్రధానంగా ఈ సీజన్‌లో కలరా, డెంగీ, టైఫాయిడ్, విరోచనాలు వంటి వ్యాధులు సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వాతావరణం చల్లబడడంతో అనేక కొత్త కొత్త వైరస్‌లు ప్రభావం చూపుతాయి. స్వైన్ ఫ్లూ వ్యాధి ఈ సీజన్లనే సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వైరస్‌ల కారణంగా దగ్గు, జ్వరంతో పాటు అస్వస్థతలు తలెత్తుతాయి. ప్రధానంగా వృద్ధుల్లో షుగర్, బీపీ వంటి వ్యాధులున్న వారు ఎంతో ఇబ్బంది పడుతారు. విబ్రియో కలరా అనే బ్యాక్టీరియా వల్ల కలరా, ఎస్ టైఫె బ్యాక్టీరియా వల్ల టైఫాయిడ్, రోటా వైరస్ వల్ల డయేరియా, ఈడీస్ ఈజిప్ట్ దోమతో డెంగీ, ఇన్‌ఫ్లూయెంజా వైరస్‌లతో వివిధ రకాలైన వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

ఉపశమనం పొందే మార్గాలు..

సాధరణ జలుబు, దగ్గు వంటి వాటికి వేడి నీటితో ఆవిరి పట్టడంతో పాటు పారాసెటమెల్ ట్యాబెట్లు వాడవచ్చు. విక్స్‌వేపోరబ్ వంటివి వేడి నీటిలో వేసి ఆవిరి పట్టవచ్చు. మూడు నాలుగు రోజుల నుంచి ఉపశమనం పొందలేకపోతే డాక్టర్‌ను సంప్రదించాలి. విరోచనాలు, వాంతులతో బాధపడే వారు వీలైనంత త్వరలో డాక్టర్‌ను సంప్రదించాలి. ఓఆర్ఎస్ ద్రావణంతో గ్లూకోజ్ వంటివి తీసుకోవాలి. డయోబెటిస్, బీపీ ఉన్న వాటిని అదుపులో ఉంచుకునేందుకు జాగ్రత్తలు వహించాలని గుల్జార్‌హౌజ్ మామాజుమ్లా పాటక్ ప్రాంతానికి చెందిన డాక్టర్ సురేందర్ శర్మ తెలిపారు.

ముందు జాగ్రత్తలు..

- తాగేనీరు శుభ్రంగా ఉండాలి.
- బయట అమ్మే వివిధ తినుబండారాలు, మసాలల వంటి పదార్థాలు తీసుకోరాదు. – వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి.
- చలిగాలిలో ఎక్కువగా తిరగవద్దు, అత్యవసరమనుకుంటే చెవులకు స్కార్ఫ్(రుమాలు) ధరించాలి.
- చిన్న పిల్లలకు గాలి తగలకుండా ఒంటిని పూర్తిగా కప్పేసే విధంగా దుస్తులు వేయాలి.
- దోమ కాటు నుంచి శరీరాన్ని కాపాడుకునేందుకు దోమ తెరలు, కాయిల్స్ వంటివి ఉపయోగించాలి.
- పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- ఇళ్లల్లో పాత టైర్లు, ఎండిపోయిన కొబ్బరిచిప్పలు ఉంటే వాటిలో వర్షపు నీరు నిలిచి దోమల వృద్ధి చెందే అవకాశముంది. అందుకోసం అవి లేకుండా చూసుకోవాలి.
- ప్రధానంగా వ్యక్తిగత శుభ్రత కూడా ఎంతో అవసరం.
- వర్షాకాలంలో ఎక్కువగా ఆకు కూరలు తినకుండా పప్పులు వంటివి వాడితే మంచిది.

దరఖాస్తుల ఆహ్వానం

నాంపల్లి: ఇందిరాప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కళాశాలలో 2024–2025వ విద్యా సంవత్సరానికి బీబీఏ, బీబీఏ ఈ–కామర్స్ స్కిల్స్ బేస్డ్ కోర్సుల్లో చేరడానికి ఆసక్తి కలిగిన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వరలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందే విధంగా ఈ కోర్సును రూపకల్పన చేయడం జరిగిందని తెలిపారు. ఈ కోర్సుల ద్వారా విద్యార్థులకు నైపుణ్యాన్ని నేర్పించడమే కాకుండా బీబీఏ ఈ కామర్స్ విద్యార్థులకు 6వ సెమిస్టర్‌లో అప్రెంటీస్ ఉంటుందని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్‌లో ఎంపికై ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. కళాశాలలో బీబీఏ ఈ–కామర్స్ కోర్సులో 60 సీట్లు ఉన్నాయని, దోస్త్ మూడో ఫేజ్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె సూచించారు.

జగదాంబ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా సుదర్శన్

చార్మినార్: సుల్తాన్‌షాహి జగదాంబ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా ఎ.సుదర్శన్‌ను ఏకగ్రీవంగా నియమించినట్లు కమిటీ చైర్మన్ రాకేష్ తివారీ తెలిపారు. శశాంక్ తివారీ, నర్సింహ్మా, వి.రాఘవేంద్ర, విక్రం సింగ్, గౌతం పాండే, రాంచందర్ పాండే, ఎం.సాయి కిరణ్ తదితరులను కార్యవర్గ సభ్యులుగా నియమించినట్లు ఆయన తెలిపారు.

ప్రత్యేక పూజలు



గోల్కొండ: గోల్కొండ కోటపై కొలువుదీరి ఉన్న మహంకాళీ అమ్మవార్లకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. గోల్కొండ బోనాలు విజయవంతంగా జరిపిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వృత్తిపని వారి సంఘం అధ్యక్షుడు సాయిబాబాచారి, పూజరులు, భక్తులు పాల్గొన్నారు.

ఆత్మహత్యనా.. ప్రమాదామా?

రైలు పట్టాలపై మహిళ శరీర భాగాలు

నాంపల్లి: రైలు పట్టాలు దాటుతున్న ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెంది శరీర భాగాలన్నీ చెల్లా చెదురయ్యాయి. రైలింజన్ మధ్యలో ఇరుక్కుపోవడంతో కిలో మీటరు మేరకు ఈడ్చుకెళ్లడంతో ఆమె శరీరం ముక్కలు ముక్కలుగా తెగిపోయాయి. వేర్వేరుగా తెగిపడిన శరీర భాగాలను రైల్వే పోలీసులు మూటకట్టుకుని పోస్టుమార్టానికి తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. సుమారు 35–40 సంవత్సరాల వయస్సున్న ఓ గుర్తు తెలియని మహిళ సనత్‌నగర్ యార్డు అప్‌లైన్‌లో బుధవారం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడికి చేరుకోగా రైలు పట్టాల మీద తెగిపడిన ఉన్న శరీర భాగాలను ఒక్కొక్కటి సేకరించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతురాలి ఒంటిపై పసుపు రంగు బ్లౌజ్, నీలం రంగు నైటీ, ఎరుపు రంగు ఎమ్‌రెడీ చున్నీ, లేత గులాబీ రంగు చెప్పులు ధరించినట్లు పోలీసులు తెలిపారు. పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టిందా..లేక ఆత్మహత్యకు పాల్పడిందా అనే కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

కులమతాలకతీతంగా సంక్షేమం


ఈద్ మిలాప్‌లో పాల్గొన్న అలీ మస్కతి

చార్మినార్: తమ ప్రభుత్వం కుల మతాలకతీతంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పని చేస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రచార, ప్రణాళిక కమిటీ కన్వీనర్, మస్కతి డైరీ ప్రొడక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ అలీ మస్కతి అన్నారు. మస్కతి డైరీ ప్రొడక్ట్స్ ఆధ్వర్యంలో కోట్ల అలీజాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బక్రీద్ ఈద్ మిలాప్ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అలీ మస్కతి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హాయాంలో అమలు జరుగుతున్న ఆరు గ్యారంటీలపై రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. పాతబస్తీలో నిర్వహించే ఈద్ మిలాప్‌లు ఇరు వర్గాల ప్రజల్లో శాంతి సామరస్యంతో పాటు ప్రేమాభిమానాలు కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఫేరోజ్‌ఖాన్, ఉస్మాన్ అల్ హజిరీ, షేక్ అక్బర్, ఎన్ఆర్ఐ ఇఫ్తేకార్ షరీఫ్, కాలేద్ మస్కతి, సుల్తాన్ మస్కతి, మన్నాన్, మహ్మద్ ఒమర్ పాల్గొన్నారు.

సమాజ సేవను బాధ్యతగా భావించాలి



గోల్కొండ: సమాజ సేవను ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. పదేళ్లుగా సమాజ సేవను సమర్థవంతంగా చేస్తున్న గోల్కొండకు చెందిన మహ్మద్ అశ్రత్‌కు బుధవారం ఆయన జ్ఞాపిక అందజేశారు. పేదలను ఆదుకోవడమే కాకుండా కరోనా సమయంలో ఉపాధి కోల్పోయిన కూలీలకు అండగా నిలిచిన మహ్మద్ అశ్రత్ నేటి యువతకు ఆదర్శమన్నారు.

స్నేహితుడిపై రౌడీషీటర్ కత్తితో దాడి

చాంద్రాయణగుట్ట: మద్యం తాగుతున్న విషయంలో స్నేహితుల మధ్య తలెత్తిన వివాదంలో స్నేహితుడిపై కత్తితో దాడి చేసిన ఘటన శాలిబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అలీబాగ్‌కు చెందిన ఫెరోజ్(28), రౌడీషీటర్ ఫయాజ్ టక్కర్(38)లు స్నేహితులు. వీరిద్దరు మంగళవారం అర్ధరాత్రి చందూలాల్ బారదారిలో మద్యం సేవిస్తున్నారు. ఈ క్రమంలోనే వీరిద్దరి మధ్య వివాదం తలెత్తడంతో ఆగ్రహానికి గురైన ఫయాజ్ టక్కర్ తన వెంట తెచ్చుకున్న కత్తితో ఫెరోజ్ మెడపై దాడి చేసి పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న శాలిబండ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

'అందరికి శ్రీహరే అంతరాత్మ' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రంగరాజన్

గన్‌ఫౌండ్రీ: హిందూ మతంలో ద్వేషానికి, అసమానతలకు చోటు లేదని చిల్కూర్ బాలాజీ దేవస్థానం ప్రధాన అర్చకులు రంగరాజన్ అన్నారు. బుధవారం ఆదర్శ్‌నగర్‌లోని బిర్లా సైన్స్ ఆడిటోరియంలో అన్నమయ్య కళాక్షేత్రం, హిందూస్ ఫర్ ప్లూరలాటీ అండ్ ఈక్వాలిటీ సంస్థల ఆధ్వర్యంలో 'అందరికీ శ్రీహరియే అంతరాత్మ'అనే పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. అదేవిధంగా ద్వేషం, అసమానత్వాలకు వ్యతిరేకంగా హిందూమతం అనే అంశంపై మహా సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్వేషం, అసహనం, సంకుచితత్వం లాంటి అవలక్షణాలేవి భారతీయ తాత్వికతలో లేవని శాంతియుత సహజీవనమే హిందూ యోచన, ఆచరణ అని స్పష్టం చేశారు. అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి మాట్లాడుతూ..ఎంతో విశాల భావన కలిగిన హిందూ మతాన్ని ఒక సంకుచిత చట్రంలో ఇరికించి వక్రీకరించేందుకు కొందరు నిరంతరం ప్రయత్నిస్తున్నారని ఈ ధోరణి హిందూ మతానికి చేటు కలిగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతకు ముందు సురభి కళాకారులు ప్రదర్శించిన శ్రీనివాస కల్యాణం నాటకం, అన్నమయ్య సంకీర్తనల గీతాలాపన ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో హిందూస్ ఫర్ ప్లూరాలిటీ అండ్ ఈక్వాలిటీ అధ్యక్షుడు సాధు త్రినాథదాస్, జై భారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయ విహారం రమణమూర్తి, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 8వ తరం మునిమనువడు వీరం బట్లయ్యస్వామి యోగీ ప్రభాకర్ గురూజీ, యోగాచార్య ఎస్.శైలజ, బిర్లా మందిర్ ఆలయ అర్చకులు లక్ష్మీనరసింహాచార్యులు, రజిని పాల్గొన్నారు.

బల్‌రామ్‌కు జీవన సాఫల్య పురస్కారం

సుల్తాన్‌బజార్: సీఎస్ఆర్ విద్యా సంస్థలు, నాగర్‌కర్నూల్ వారి ఆధ్వర్యంలో చింతలపల్లి నిర్మల దేవి–నారాయణరావు జీవన సాఫల్య పురస్కారం 2024 ప్రదానోత్సవ కార్యక్రమం బుధవారం రాత్రి బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో జరిగింది. ఇందులో భాగంగా సింగిరెడ్డి నీరంజన్‌రెడ్డి మన కల నిజం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నీరంజన్‌రెడ్డి హాజరై పురస్కారాన్ని నాగవరం బల్‌రామ్‌కు ప్రదానం చేశారు. అనంతరం సింగిరెడ్డి వ్యాసాల సంపుటి మన కళ నిజం అనే సంపుటిని ఆవిష్కరించారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబెదుల్లా కొత్వాల్, టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ గంట చక్రపాణి, తెలంగాణ రిసోర్స్ సెంటర్ చైర్మన్ మణికొండ వేదకుమార్, పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, చింతలపల్లి భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు చెక్

సాక్షి ఎఫెక్ట్..


నూతన పైప్‌లైన్లకు ఏర్పాట్లు

లంగర్‌హౌస్: మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభమయ్యాయి. లంగర్‌హౌస్ గాంధీ చౌరస్తా నుంచి అలంకార్ థియేటర్ తదితర ప్రాంతాల్లో ఎనిమిది ఏళ్లుగా మురుగు పొంగిపొర్లుతుంది. దాదాపు కిలోమీటరు దూరం వరకు ఈ దుర్గంధ నీరు ప్రధాన రహదారిపై ప్రవహిస్తుంది. సమస్యను పరిష్కరించాలంటూ సంబంధిత అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో 'మురుగు సమస్యను పరిష్కరించండి సారూ'అనే శీర్షికతో ఈనెల 11న సాక్షిలో కథనం ప్రచురితమయ్యింది. స్పందించిన అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసి, శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టారు. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌ను తొలగించి, వాటి స్థానంలో పరిమాణం ఎక్కువగా ఉన్న పైప్‌లైన్ ఏర్పాటు పనులు ప్రారంభించారు.

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు

యాకుత్‌పురా: పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ సర్కిల్–07 సంతోష్‌నగర్ డిప్యూటీ కమిషనర్ శివకుమార్ తెలిపారు. బుధవారం ఆయన సర్కిల్ పరిధిలోని యాకుత్‌పురా, బడాబజార్, రెయిన్‌బజార్, ఎస్ఆర్టీ కాలనీ, తలాబ్‌కట్టా, భవానీనగర్, బీబీ బజార్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కమిషనర్, జోనల్ కమిషనర్ల ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి సిబ్బంది పనితీరును పరిశీలిస్తున్నామన్నారు. స్థానిక ప్రజలు ఓపెన్ పాయింట్లల్లో చెత్త వేయకుండా సిబ్బందితో అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ముతవల్లియన్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడిగా మీర్ అబ్బాస్ అలీ మూస్వి



శాలిబండ: తెలంగాణ ముతవల్లియన్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆషూర్‌ఖానాల సంరక్షకుల సంస్థ అంజుమన్–ఏ–ముతవల్లియన్ అధ్యక్షుడు మీర్ అబ్బాస్ అలీ మూస్వి ఎన్నికయ్యారు. వరుసగా మూడోసారి అధ్యక్షుడిగా అబ్బాస్ అలీ మూస్వి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికకావడం సంతోషంగా ఉందని, తనపై నమ్మకంతో ఎన్నుకున్న వారందరికీ, మత పెద్దలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మేరు కులస్తులకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలి


ఎంపీ డాక్టర్ మల్లు రవిని కలిసిన పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: మేరు కులస్తులకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలని టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం ఎంపీ డాక్టర్ మల్లు రవిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీని మేరు కులస్తులు కలిసే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. రాహుల్ గాంధీ అపాయింట్ మెంట్ ఇప్పిస్తే మేరు కులస్తుల సమస్యలు వివరిస్తామని, దాదాపు 20 లక్షల మంది ఉన్న మేరు కులస్తులకు చైర్మన్ పదవులు ఇవ్వాలని రాహుల్‌గాంధీకి విజ్ఞప్తి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిమూలం శంకర్, పోల్కం వినయ్‌రాజ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి


వేడుకల్లో మెట్టు సాయికుమార్ మనిలాల్‌షా

అబిడ్స్: కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి, దేశ సంక్షేమం కొనసాగుతుందని రాష్ట్ర ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలోనే కాక దేశ నలుమూలలా ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ పాటుపడుతుందన్నారు. బుధవారం గాంధీభవన్‌లో జరిగిన రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మనిలాల్ షా, కిశోర్, నరేష్‌కుమార్, సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


మరమ్మతులు చేయించిన డాక్టర్ మెట్టు శ్రీకాంత్

అబిడ్స్: ప్రజా సమస్యల పరిష్కారానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని గోషామహల్ నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మెట్టు శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం ఆగాపురా ప్రాంతంలో ప్రజలకు సమస్యగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగింపజేసి కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. అనంతరం డాక్టర్ మెట్టు శ్రీకాంత్ మాట్లాడుతూ..ఆగాపురా ప్రాంతంలో 15 ఏళ్లుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. గోషామహల్, నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా ఆగాపురాలోని తమ కార్యాలయంలో చెబితే వెంటనే జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు, విద్యుత్, ఇతర శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.